క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 45, పందిరి బీర 45, క్యాబేజీ 8, క్యారెట్ 18, దొండ 18, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 50, కీర 13, దోసకాయ 23, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 23, చామగడ్డ 50, మొరంగడ్డ 16, కందగడ్డ 40, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 3–5. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

ఆహ్వానం



వెల్లాల రామ్మోహన్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న కమిటీ సభ్యులు

సనత్‌నగర్: ఈ నెల 13 నుంచి ప్రారంభం కానున్న వైశాఖీ ఉత్సవాలకు హాజరవ్వాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య అధ్యక్షుడు వెల్లాల రామ్మోహన్‌ను అమీర్‌పేట గురుద్వారా కమిటీ సభ్యులు సోమవారం ఆహ్వానించారు. ఈ ఉత్సవాలకు వేలాదిగా హాజరయ్యే సిక్కు సోదరుల దాహార్తిని తీర్చేందుకు వెల్లాల రామ్మోహన్ 500 నీటి బాటిల్స్ వితరణ చేశారు.

వెలగని స్ట్రీట్ లైట్స్

లాలాపేట: తార్నాక డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో స్ట్రీట్ లైట్లు వెలగకపోవడంతో రాత్రి సమయంలో బస్తీ, కాలనీల్లో చీకటి అలుముకుంటుంది. లాలాపేట కమాన్ ప్రాంతంలో నాలుగు రోజుల నుంచి లైట్లు వెలగడం లేదని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆ ప్రాంత వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మాణికేశ్వర్‌నగర్‌లో కొనసాగుతున్న రిలే దీక్షలు



దీక్షలో పాల్గొన్న శ్రీరామ గండికోట వడ్డెర సంఘం నాయకులు

లాలాపేట: చేయి చేయి కలుపుదాం హాస్పిటల్ నిర్మిద్దామంటూ మాణికేశ్వర్‌నగర్ అఖిల పక్షం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ నిరసన కార్యక్రమాలకు మద్దతుగా సోమవారం 6వ రోజు శ్రీరామ గండికోట వడ్డెర సంఘం నాయకులు దీక్ష చేపట్టారు. బీఆర్‌ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర నాయకులు రాంబాబు యాదవ్ దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్పిటల్ ఏర్పాటు అనేది బస్తీ వాసుల న్యాయమైన డిమాండ్ అని ఈ విషయాన్ని త్వరలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. సాయంత్రం డివిజన్ అధ్యక్షులు గండికోట విజయ్‌కుమార్, బోదాసు నర్సింహ నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. గండికోట కిరణ్, గండికోట కుమార్, జి. రమేష్, జి. నర్సింహ, జి. కుమార్, యాదయ్య, లక్ష్మణ్, వెంకట్, శ్రీనివాస్, సత్తయ్య పాల్గొన్నారు.

కడియం రాజు ఆదర్శ విద్యార్థి నేత

ఉస్మానియా యూనివర్సిటీ: ఏబీవీపీ మాజీ జాతీయ నాయకుడు దివంగత డాక్టర్ కడియం రాజు ఆదర్శవంతమైన విద్యార్థి నాయకుడని ఎంఎస్‌ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షులు రుద్రవరం లింగస్వామి అన్నారు. సోమవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ న్యూసెమినార్ హాల్లో కడియం రాజు యాదిలో సభ అనే శీర్షికతో సంస్మరణ సభను నిర్వహించారు. కార్యక్రమానికి రుద్రవరం లింగస్వామి అధ్యక్షత వహించగా వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని కడియం రాజుతో గల అనుబంధాన్ని గుర్తు చేశారు.

రంజాన్ తోఫాల అందజేత



రంజాన్ తోఫాలు అందజేస్తున్న అత్తెల్లి అరుణగౌడ్

రాంగోపాల్‌పేట్: బీఆర్‌ఎస్ హయాంలోనే అన్ని వర్గాలకు సమప్రాధాన్యం లభిస్తుందని రాంగోపాల్ పేట్ మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్ అన్నారు. రంజాన్ సందర్భంగా ముస్లింలకు ప్రభుత్వం తరపున అందించే రంజాన్ గిఫ్టులను రాంగోపాల్‌పేట్‌లో సోమవారం ఆమె అందజేసి మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా అన్ని పండగలకు సమప్రాధాన్యం ఇస్తున్న ఘటన కేవలం బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే తగ్గుతుందన్నారు.



సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ వద్ద నడి రోడ్డుపై ప్రయాణికులు

నిలువ నీడ కరువు!

- బస్ షెల్టర్లు లేక ఎండలోనే ప్రయాణికులు
- ఉన్న కొన్ని షెల్టర్లు వ్యాపారుల పాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

సనత్‌నగర్: ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న బస్ షెల్టర్లు పలు ప్రాంతాల్లో లేకపోవడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండుటెండలో బస్సుల కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. కొన్ని చోట్ల బస్ షెల్టర్లు లేకుంటే.. మరికొన్ని చోట్ల ఉన్న కూడా అవి వివిధ వ్యాపారాలకు అడ్డాలుగా మారడంతో బస్సుల కోసం నడిరోడ్డుపై నిలబడి వేచిచూస్తున్నామని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు ప్రయాణికుల సంక్షేమమే లక్ష్యంగా ఆర్టీసీ ప్రకటనలు ఊదరగొడుతున్నా ఆచరణలో మాత్రం పూర్తిగా వైఫల్యం చెందింది. సనత్‌నగర్ బస్టాండ్ నుంచి రోజుకు దాదాపుగా 80–100 బస్సులు నగరంలోని అన్ని ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటాయి. వేలాది మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుస్తాయి. ఇదిలా ఉంటే బస్సుల



ఎర్రగడ్డ చౌరస్తాలో మండుటెండలో ఇలా..

కోసం వేచి ఉందామంటే షెల్టర్లే కరువయ్యాయి.

షెల్టర్ ఉన్నా ఆగని బస్సులు..

ముఖ్యంగా సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్, జెక్‌కాలనీ రిక్వెస్ట్ స్టాప్, ఎర్రగడ్డ చౌరస్తా, బల్కంపేట ప్రాంతాల్లో బస్సు షెల్టర్లు లేక నడిరోడ్డు పైనే ప్రయాణికులు నిలబడాల్సిన దుస్థితి నెలకొంది. రోజురోజుకు ఎండలు తీవ్రమవుతుండడంతో రోడ్లపై ప్రయాణికులు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు. ఇక కొన్ని ప్రాంతాల్లో బస్సు షెల్టర్లు ఉన్నా వ్యాపారాలకు కేంద్రంగా మారిపోయాయి. ముఖ్యంగా ఈఎస్‌ఐ (కూకట్‌పల్లి వైపు వెళ్లే బస్సులు ఆగే బస్టాప్), ఎర్రగడ్డ ప్రాంతాల్లోని బస్‌షెల్టర్లు వ్యాపారాలతో ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన షెల్టర్లు కాస్తా నిరుపయోగంగా మారి ప్రయాణికులు నడిరోడ్డుపై వేచి ఉండాల్సి వస్తోంది. ఇదిలా ఉంటే కొన్నిచోట్ల బస్సు షెల్టర్లు ఉన్నా బస్సులు ఆగని పరిస్థితి ఉంది. ముఖ్యంగా టీబీ ఆస్పత్రి, సనత్‌నగర్ హెటిరో డ్రగ్స్ వంటి బస్టాపుల్లో అన్ని బస్సులు ఆగడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రకటనల ఆదాయం పైనే దృష్టి..

ఎక్కడెక్కడ బస్ షెల్టర్ల నిర్మాణం చేయాలో గుర్తింపు ప్రక్రియ ఆర్టీసీ చేపట్టాల్సి ఉండగా ఆ బాధ్యత జీహెచ్‌ఎంసీ చూస్తోంది. అయితే చాలాచోట్ల బస్ షెల్టర్లు ఉన్నా అవి కేవలం ప్రకటనలకు మాత్రమే ఏర్పాటు చేసినట్లు కనిపిస్తోంది. ప్రయాణికుల ప్రయోజనాలను పక్కనబెట్టి కేవలం ఆదాయం కోసమే ప్రకటనల నిమిత్తం షెల్టర్ల నిర్మాణం జరపడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రయాణికుల నుంచి ప్రతిరోజూ లక్షలాది రూపాయల ఆదాయం ఆర్టీసీకి అందుతున్నా షెల్టర్ల ఏర్పాటులో అలక్ష్యం తగదని, దీనిపై ఆర్టీసీ, జీహెచ్‌ఎంసీ అధికారులు సమన్వయంతో వ్యవహరించి బస్సు షెల్టర్లను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. అలాగే ప్రస్తుతం ఉన్న బస్సు షెల్టర్ల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వైశాఖీ ఉత్సవాలకు గురుద్వారా ముస్తాబు

అమీర్‌పేట: ఖల్సాపంత్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమీర్‌పేట గురుద్వారా సాహెబ్ ఆధ్వర్యంలో నిర్వహించే వైశాఖీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. వేడుకల నేపథ్యంలో వచ్చే భక్తుల కోసం నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. అమీర్‌పేట గురుద్వారాను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఈ నెల 13 నుంచి 15 వరకు జరిగే ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు తెలంగాణ రాష్ట్రంతో పాటు ఇతర ప్రాంతాల నుండి సిక్కు సోదరులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. మొదటి రోజు అమృత్ పాన్ కార్యక్రమాన్ని సిక్కు సంప్రదాయబద్ధంగా అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. పంజాబ్‌లోని అమృత్‌సర్ నుంచి ప్రత్యేకంగా గురుద్వారాకు విచ్చేసిన పంచ్‌ప్యారస్‌గా పిలిచే ఐదుగురు సిక్కు మతగురువులు (రాగి జత్తాస్) గుర్బాణీ కీర్తనలు ఆలపిస్తూ గురుగ్రంథ పఠనం చేస్తూ అమృత్‌పాన్ (పవిత్ర పానీయం)ను తయారు చేశారు. సిక్కు మత సంప్రదాయాలను పాటిస్తూ సిక్కు మతాన్ని అధికారికంగా అంగీకరించే వారికి ఈ పానీయాన్ని అందజేస్తారు. హోలీ బాప్టిజంగా పేర్కొనే అంశం ద్వారా సిక్కు యువతీ, యువకులు, మహిళలు, మతపెద్దలు అమృత్‌పాన్ స్వీకరించారు. పవిత్ర పానీయాన్ని తీసుకున్న వారు జీవితాంతం సిక్కు మత నిబంధలైన కేశ్, కడా, కంగా కృపాన్, కచేరాగా పేర్కొనే ఐదు నిబంధనలు పాటించాల్సి ఉంటుందని గురుద్వారా కమిటీ సభ్యులు తెలిపారు.

సుమారు 50 వేల మంది భక్తులు..

వైశాఖీ వేడుకల్లో ప్రధాన ఘట్టమైన విశాల్ దివస్,



విద్యుద్దీపాలతో సిద్ధమైన అమీర్‌పేట గురుద్వారా

నగర్ కీర్తన్ కార్యక్రమాలను అత్యంత వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. రెండో రోజు ఉదయం గురుద్వారాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. అనంతరం సిక్కులు పవిత్రంగా భావించే గురుగ్రంథాన్ని ప్రత్యేకంగా రూపొందించిన వాహనంలో ఊరేగిస్తూ ధరంకరం రోడ్డులోని గురుగోవింద్‌సింగ్ మున్సిపల్ స్టేడియంకు తీసుకువస్తారు. జంటనగరాల నుంచి సుమారు 50 వేల మంది భక్తులు ఇందులో పాల్గొంటారని ప్రబంధక్ కమిటీ సభ్యులు తెలిపారు. వేడుకలను పురస్కరించుకుని అమీర్‌పేట పరిసర ప్రాంతాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్‌ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ కె.సైదులు తెలిపారు.

కంటోన్మెంట్‌లో తుగ్లక్ పాలన



సమావేశంలో మాట్లాడుతున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

ముఖ్య నేతల సమావేశంలో మర్రి

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో తుగ్లక్ పాలన సాగుతోందని బీఆర్‌ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఆయన అదనపు బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో సోమవారం బోయిన్‌పల్లిలోని తన కార్యాలయంలో స్థానిక నేతలతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల చైర్మన్లు మన్నె క్రిశాంక్, గజ్జెల నాగేశ్, డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తెలు లాస్య నందిత, నివేదిత, సీనియర్ నేత శ్రీగణేశ్, బోర్డు మాజీ సభ్యులు, వివిధ వార్డుల అధ్యక్షులు, సీనియర్ నేతలతో కలసి విలేకరులతో మాట్లాడారు. రెండేళ్లుగా కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు నిర్వహించకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తమ ప్రతినిధిగా ఓ బ్రోకర్‌ను నియమించుకుని పాలన సాగిస్తోందన్నారు. బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కారు వైఫల్యానికి కంటోన్మెంట్ ఓ ప్రత్యక్ష ఉదాహరణ అన్నారు. అవినీతిమయంగా సాగుతున్న కంటోన్మెంట్ పాలనను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఏ విధంగా సమర్థిస్తారని ప్రశ్నించారు. ఓట్ల తొలగింపు, లాల్ బజార్‌లో డంపింగ్ యార్డు తరలింపు తదితర సమస్యల నిరంతర పోరాటం చేస్తామని అన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా శ్రీగణేశ్..

2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసిన శ్రీగణేశ్, 2019 పార్లమెంట్ ఎన్నికల నాటికి బీఆర్‌ఎస్‌లో చేరారు. అయితే వివిధ కారణాల వల్ల పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వచ్చిన ఆయన శ్రీగణేశ్ ఫౌండేషన్ పేరిట సొంతంగానే ప్రజా కార్యక్రమాలు చేపడుతున్నారు. సాయన్న మరణానంతరం మర్రి రాజశేఖర్ రెడ్డి, శ్రీగణేశ్‌తో రెండుసార్లు ప్రత్యేకంగా భేటీ అయ్యి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందిగా ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో మర్రి ఆహ్వానం మేరకు సోమవారం శ్రీగణేశ్ నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతల సమావేశానికి రావడంతో బీఆర్‌ఎస్ శ్రేణులు సైతం ఆశ్చర్యానికి లోనయ్యారు. ఈ సందర్భంగా శ్రీగణేశ్ మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసిన తాను మర్రి రాజశేఖర్ రెడ్డి పిలుపు మేరకే పార్టీలోకి బీఆర్‌ఎస్‌లో చేరానని ఆయన సూచనల మేరకు పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ప్రకటించారు.



మర్రికి అభినందనలు తెలుపుతున్న బీఆర్‌ఎస్ నేతలు

అభినందనల వెల్లువ..

నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులైన మర్రి రాజశేఖర్ రెడ్డికి స్థానిక నేతలు పెద్ద ఎత్తున అభినందనలు తెలిపారు. సోమవారం ఉదయం నుంచీ మర్రి కార్యాలయంలో బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలతో కిటకిటలాడింది. బోర్డు మాజీ సభ్యులు మహేశ్వర్ రెడ్డి, పాండుయాదవ్, లోకనాథం, నళిని కిరణ్, ప్రభాకర్, పార్టీ నేతలు టీఎస్ శ్రీనివాస్, పెద్దాల నర్సింహ, సదానంద్ గౌడ్, నర్సింహ ముదిరాజ్, ప్రభుగుప్తా, నర్సారెడ్డి తదితరులు మర్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థుల్లో సామాజిక స్పృహను పెంచే కార్యక్రమాలు చేపట్టాలి

రాంగోపాల్‌పేట్: విద్యా సంస్థల్లో విద్యార్థులకు విద్యతో పాటు వారిలో సామాజిక స్పృహను పెంచే కార్యక్రమాలను చేపట్టాలని భారత్ శోకా గక్కాయ్ సంస్థ ప్రతినిధి మౌనిక అన్నారు. సోమవారం వెస్ట్‌మారేడుపల్లిలోని విజ్ఞాన్ జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో భారత్ శోకా గక్కాయ్ సంస్థ ఆధ్వర్యంలో ఐక్యరాజ్య సమితి గుర్తించిన సహనీయ అభివృద్ధి, లక్ష్యాలను గురించి అవగాహన సదస్సును నిర్వహించారు. ఆ సందర్భంగా మౌనిక మాట్లాడుతూ.. నేర్చుకోవడం, శ్రద్ధతో ఆలోచించడం, సాధికారత కల్పించడం అనేది తమ సంస్థ ఆదర్శమని విద్యార్థులను కేవలం విద్యకే పరిమితం చేయకుండా వారిలో సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

మరింత మెరుగైన సమాజం తయారవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కాలేజ్ ప్రధాన అధ్యాపకురాలు డాక్టర్ ఎస్ అరుణ, సంచాలకుల డాక్టర్ విజయ్ ప్రసాద్, ప్రొ. జయశ్రీ, మాట్లాడారు.

మోడల్ స్కూల్ హాస్టల్ సిబ్బంది వేతనాలు పెంచాలి

ముషీరాబాద్: మోడల్ స్కూల్ హాస్టల్ సిబ్బంది జీతాలు పెంచి సకాలంలో చెల్లించాలని ప్రోగ్రెసివ్ మోడల్ స్కూల్ హాస్టల్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎల్.పద్మ అన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న 175 మోడల్ స్కూల్ ఆంగ్ల మాధ్యమంతో నడుస్తున్న పాఠశాలలు, వీటి అనుబంధ హాస్టల్ సిబ్బంది సమస్యలపై విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మోడల్ స్కూల్ హాస్టల్ సిబ్బంది పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు.

- హాస్టల్ విద్యార్థినులకు ఆసుపత్రి అవసరాలు ఏర్పడితే రవాణా సౌకర్యం లేదని దీనికోసం ఆటోని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.
- సుమారు 100 మంది పనిచేసే సిబ్బందికి పని భారం పెరిగి, వేతనాలు సకాలంలో రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.
- కేజీబీవీ ఉద్యోగులతో సమానంగా జాబ్ చార్జ్‌ను



మాట్లాడుతున్న ఎస్.ఎల్.పద్మ

ప్రకటించాలని, 24 గంటల పనిదినాన్ని మార్పు చేసి 8 గంటలు అమలు చేయాలన్నారు.

- మెటర్నిటీ లీవ్‌ను కొనసాగించడంతో పాటు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఈనెల 24న కలెక్టర్లకు వినతిపత్రాలు ఇస్తామన్నారు. అనంతరం నవ్య, యామిని, సుల్తానా, లలిత, అరుణ, భాగ్యమ్మ, మాధవి, లలితారాణి, రేణమ్మ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ నియామకాలపై చర్చ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీజీ, ఇంజినీరింగ్, న్యాయశాస్త్ర తదితర కోర్సులను బోధించేందుకు యూజీసీ ఇచ్చిన అవకాశం మేరకు ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ అధ్యాపకులను నియమించాలని నిర్ణయించారు. అందుకు ఆరు నెలల క్రితం ఓయూ పాలక మండలి ఆమోద ముద్ర వేసినా ఒక్కరిని కూడా నియమించలేదు. అభ్యర్థులకు పీజీ, పీహెచ్‌డీ విద్యార్హతలు లేకున్నా సంబంధిత సబ్జెక్టులో 15 సంవత్సరాలు పనిచేసి విషయ పరిజ్ఞానం గల నిపుణులను బోధన కోసం అధ్యాపకులుగా నియమించుకునేందుకు యూజీసీ అవకాశం కల్పించింది. అయినా ఓయూ అధికారులు ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై చర్చ జరుగుతోంది.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రసూల్‌పురా: అనుమానాస్పద స్థితిలో మృతి చెంది కుళ్లిపోయిన మృతదేహాన్ని తిరుమలగిరి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రవణ్ తెలిపిన వివరాల మేరకు తిరుమలగిరిలోని కోహ్–ఏ–మామ్ దర్గా నిర్వాహకులు సయ్యద్ కాజీం హుస్సేన్ ఆదివారం రాత్రి ఏడు గంటల సమయంలో దర్గాలోనికి వెళుతుండగా దుర్వాసన రావడంతో సమీపంలోకి వెళ్లి చూడగా రాయిపైన ఓ వ్యక్తి మృతదేహం కుళ్లిన స్థితిలో కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహం స్వాధీనం చేసుకుని గాంధీ మార్చురీకి తరలించారు.

ఘనంగా దేవాలయ వార్షికోత్సవం

సనత్‌నగర్: బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని రామలింగేశ్వరస్వామి దేవస్థానంలోని భూలక్ష్మీ అమ్మవారి దేవాలయ సప్తమ వార్షిక వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈఓ విఠలయ్య, ఆలయ ధర్మకర్త విశాల్ సూదం పర్యవేక్షణలో తెల్లవారుజామున 5 గంటల నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుగంధద్రవ్యాలతో అభిషేకం, మధ్యాహ్నం మహా నైవేద్యం, హారతి, సాయంత్రం మహిమాన్విత శతశ్రీసూక్త సహిత మహా హోమం, పూర్ణాహుతి, మహా మంగళహారతి నిర్వహించారు.

తొలి తెలుగు కథా రచయిత్రి బండారు అచ్చమాంబ

చిక్కడపల్లి: తొలితెలుగు కథా రచయిత్రి బండారు అచ్చమాంబ అని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. సోమవారం త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో ప్రముఖ కథా రచయిత్రి బండారు అచ్చమాంబ యాదిలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సాధారణ మధ్య తరగతి కుటుంబ జీవితాలను కథా వస్తువులుగా తీసుకుని ఆమె కథలు రాశారన్నారు. ప్రముఖ రచయిత్రి ముక్తేవి భారతి మాట్లాడుతూ.. నాటి పరిస్థితులు, మహిళల స్థితిగతులను తెలుసుకోవడానికి అచ్చమాంబ రచనలను తిరిగి ముద్రించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గానసభ అధ్యక్షులు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించగా.. ప్రముఖులు ఎస్వీ భారతి, గుండవరపు గీతాదేవి, బండి నాగజ్యోతి తదితరులున్నారు.

కుటుంబపాలనపై ప్రధాని మాట్లాడటం శుభపరిణామం

ముషీరాబాద్: సీఎం కేసీఆర్ కుటుంబ అవినీతి పాలనపై పోరాడేందుకు ప్రజల సహకారం కావాలని ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపును స్వాగతిస్తున్నామని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ అన్నారు. సోమవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య అవినీతి అని దానిని పునాదులతో పెకిలించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. ఎన్నికల్లో అధికార పార్టీ కొన్ని వేల కోట్లు చేస్తున్న ఖర్చు దేశమంతటా చర్చ జరుగుతుందన్నారు.

- కేంద్ర దర్యాప్తు సంస్థలు అవినీతిని నిర్మూలించడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. ‘ఇటీవల ఓ జర్నలిస్టుతో జరిగిన ముఖాముఖిలో సీఎం కేసీఆర్ తనను నాయకుడిగా చేస్తే ప్రతిపక్ష పార్లమెంటు అభ్యర్థుల ఖర్చును తానే భరిస్తానని’ వాఖ్యానించారన్నారు.

ముందస్తు ఆస్తిపన్ను చెల్లింపుదారులకు రాయితీ



డీసీ డాక్టర్ తిప్పర్తి యాదయ్య తదితరులు

అంబర్‌పేట: ముందస్తు ఆస్తిపన్ను చెల్లింపుదారులకు 5 శాతం రాయితీ అవకాశం కల్పిస్తున్నట్లు దానిని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్–16 డీఎంసీ వేణుగోపాల్ కోరారు. ఈ ఏడాదికి సంబంధించిన ఆస్తిపన్ను ముందస్తు చెల్లించే వారికి ఈనెల 30న చివరి గడువు ఉన్నట్లు ఆయన సోమవారం తెలిపారు. ఆస్తిపన్ను చెల్లింపుదారులు ముందుగా చెల్లించి 5 శాతం రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రధానంగా అపార్ట్‌మెంట్లు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్లు మూకుమ్మడిగా పన్నులు చెల్లిస్తామంటే ప్రత్యేక సిబ్బంది బృందాన్ని అందుబాటులో ఉంచుతామన్నారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ముషీరాబాద్: జీహెచ్‌ఎంసీ ప్రవేశపెట్టిన ‘ఎర్లీబర్డ్’ స్కీమ్‌ను ఆస్తిపన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకుని 5 శాతం రాయితీ పొందాలని ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య సూచించారు. అడిక్‌మెట్ డివిజన్‌లో సోమవారం ‘ఎర్లీబర్డ్’ స్కీమ్‌పై ప్రజలలో అవగాహన కల్పించి వారి నుంచి ఆస్తి పన్నును సేకరించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ.. ఎర్లీ బర్డ్ స్కీమ్ ఈనెల 30 వరకు అమలులో ఉంటుందన్నారు. 2023–24 వార్షిక సంవత్సరానికి సంబంధించి ఆస్తిపన్ను ముందస్తుగా చెల్లించాలన్నారు. ఈ స్కీమ్‌లో చెల్లించిన వారికి 5 శాతం రాయితీ అవకాశం కల్పిస్తున్నామన్నారు. ముషీరాబాద్ సర్కిల్ పరిధిలోని ఆస్తిపన్ను చెల్లింపుదారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

- ముషీరాబాద్ సర్కిల్‌లో 2023 మార్చి 31 వరకు రూ.42 కోట్ల టార్గెట్ ఇవ్వగా.. రూ.39 కోట్ల 32 లక్షలు వసూలైనట్లు ప్రకటించారు.
- 2022 ఆర్థిక సంవత్సరానికి రూ.38.48 కోట్లను టార్గెట్ ఉండగా.. రూ.29.56 కోట్లు మాత్రమే వసూలు అయ్యాయన్నారు.
- గతేడాది రూ.29 కోట్ల వసూలుతో రూ.39.32 కోట్లకు తీసుకువచ్చామని కమిషనర్ తమకు ఇచ్చిన టార్గెట్‌లో రూ.93.62 శాతం వసూలు చేశామని వివరించారు. ఈ టార్గెట్‌ను చేరుకోవడంలో తమ సిబ్బంది కృషి ఎంతో ఉందన్నారు.

మెట్లు కూలి ముగ్గురికి గాయాలు

అడ్డగుట్ట: తుకారాంగేట్‌లోని మరాఠా బస్తీలో ఏళ్ల క్రితం నిర్మించిన ప్రభుత్వ భవనంలోని మెట్లు కూలి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు (భార్య, భర్త, కూతురు)కి గాయాలయ్యాయి. అడ్డగుట్ట డివిజన్‌లోని తుకారాంగేట్ మరాఠా బస్తీలో దశాబ్దకాలం క్రితం ఈడబ్ల్యూఎస్ కింద ప్రభుత్వం నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరాయి. ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా



బాలిక కాలికి అయిన గాయం

పట్టించుకోకపోవడంతో అవే భవనాల్లో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం సదరు భవనాల్లో నివాసముండే రాజ్ (24), జ్యోతి (21), సునీత(09) సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లేందుకు మెట్లు దిగుతుండగా ఉన్నట్టుండి ఒక్కసారిగా కూలిపోవడంతో రాజ్, జ్యోతిలకు చిన్నపాటి గాయాలు కాగా కూతురు సునీత కాలికి బలమైన గాయం కావడంతో ఆరుకుట్లు పడ్డాయి. సమాచారం అందుకున్న మారేడ్‌పల్లి తహసీల్దార్ మాధవి రెడ్డి, కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి ఘటనా స్థలానికి చేరుకొని బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం చేసే అందిస్తామని హామీ ఇచ్చారు.



బస్తీవాసులతో మాట్లాడుతున్న ప్రసన్నలక్ష్మి

‘డబుల్’ ఇళ్లకు అంగీకారం

తుకారాంగేట్ మరాఠా బస్తీలో ‘డబుల్’ ఇళ్ల నిర్మాణానికి సాధ్యమైనంత త్వరగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అధికారులను ఆదేశించినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. తుకారాంగేట్ మరాఠా బస్తీలో నూతనంగా డబుల్ బెడ్రూమ్ ఇళ్లు నిర్మించేందుకు బస్తీవాసులు అంగీకరించినట్లు తెలిపారు. సుమారు రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన ఇళ్లు కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. డబుల్ బెడ్రూమ్ ఇళ్లను నిర్మించి ఇవ్వడానికి ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని బస్తీవాసులకు ఆ సమయంలోనే హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. సోమవారం మరాఠా బస్తీలో మెట్ల మార్గం కూలి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి గాయాలైనట్లు తెలుసుకొని బస్తీవాసులతో మరోమారు డబుల్ ఇళ్ల కోసం చర్చించమని స్థానిక కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మికి డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ చెప్పగా ఆమె బస్తీవాసులతో చర్చించగా తమకు అంగీకారమేనని ఒప్పుకున్నారు. దీంతో డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అధికారులను అప్రమత్తం చేశారు. మరాఠా బస్తీలో నిర్మించతలపెట్టిన డబుల్ ఇళ్లను సాధ్యమైనంత త్వరగా ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.